క్లుప్తంగా

వాటర్ పైప్‌లైన్‌కు లీకేజీ



కంద్రికగూడెం వద్ద రహదారిపై నీరు ప్రవహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కంద్రిక గూడెం సమీపంలో ప్రధాన రహదారిపై సత్య సాయి పథకం ద్వారా సరఫరా అవుతున్న వాటర్ లీకేజ్ ఏర్పడింది. ఈ రహదారిపై భారీ వాహనాలు తిరగడంతో పైపులు బద్దలై నీరు లీకై మంచినీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి వెంటనే లీకేజీకి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దసరా ఉత్సవాల రాట మహోత్సవం



వాసవీ మాత ఆలయం వద్ద నిర్వహిస్తున్న రాట కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి 22వ దసరా మహోత్సవాల రాట ఉత్సవాన్ని శనివారం ఉత్సవకమిటీ అధ్యక్షుడు టీపీవీ రామతారకం ఆధ్వర్యంలో నిర్వహించారు. విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి వాసవీమాతను ఆరాధించారు. భూమిలో రాటను నెలకొల్పి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు మేడూరి వెంకటరమణ శర్మ, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

లింగపాలెం: మండలంలోని ముడిచెర్ల గ్రామంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చింతలపూడి కోర్టు న్యాయమూర్తి సీహెచ్ మధుబాబు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని, 18 ఏళ్లలోపు యువతులకు, 21 ఏళ్లలోపు యువకులకు వివాహం చేయరాదని అన్నారు. కార్యక్రమంలో లాయర్లు, తహసీల్దార్, ఎస్సై వెంకన్న, ముడిచర్ల సర్పంచ్ రావి రమాదేవి, వెంకటేశ్వరరావు, పారాలీగల్ వాలంటీర్ నందిపాము ఏసురత్నం, నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ హేమకుమారికి అవార్డు



అవార్డు అందుకుంటున్న జెడ్పీటీసీ హేమకుమారి

పోలవరం రూరల్: పోలవరం జెడ్పీటీసీ కలుం హేమకుమారికి త్రివేణీ సంగమం ఫౌండేషన్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ తరుపున దివంగత నేత, తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరున తనకు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజారమణ ఈ అవార్డు అందించారని హేమకుమారి ప్రకటించారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకు గుర్తింపు ఇవ్వడం పట్ల హేమకుమారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అవార్డు మరింత బాధ్యతను పెంచిందని చెప్పారు.

యువజన విభాగంలో పలువురికి పదవులు



దినేష్



కొండబాబు

బుట్టాయగూడెం /పోలవరం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెంకు చెందిన బగ్గి దినేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పోలవరం మండల పట్టిసీమకు చెందిన సుంకర కొండబాబు యువజన విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కొండబాబును అభినందించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా జి.సంతోష్ రెడ్డి, కొప్పుల నాగవెంకటప్రసాద్‌లను నియమించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ చింతలపూడి ఇన్‌చార్జి విజయరాజు
- పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షుల నియామకం



ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న కంభం విజయరాజు, జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయటమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు సూచించారు. పార్టీ జంగారెడ్డిగూడెం మండల ముఖ్య నాయకులు సమావేశం శనివారం జంగారెడ్డిగూడెంలో పార్టీ మండల అధ్యక్షులు ఓరిగంట నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కంభం విజయరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావులు పాల్గొన్నారు. పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులను నియమించారు. మండల యువజన విభాగానికి గంజీ వినోద్, మండల మహిళా విభాగానికి గోలి వెంకటరత్నం, మండల బీసీ సెల్ విభాగానికి కొయ్య లీలాధర్ రెడ్డి, ఎస్సీ సెల్ విభాగానికి సిర్రా రాజేష్, క్రిస్టియన్ సెల్ విభాగం అధ్యక్షుడిగా అడవికొట్టు చంద్రశేఖర్‌లు నియమితులయ్యారు. వీరిని ముఖ్య అతిథులు అభినందించారు.

పార్టీకి పెరిగిన ఆదరణ

ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మండల స్థాయి నాయకులు కృషి చేయాలన్నారు. జెట్టి గురునాథరావు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పాలనలో విఫలమైందని, ప్రజలలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరిగిందని తెలిపారు. త్వరలో గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర కుమార్, మండల సమన్వయ కమిటీ నాయకులు కనికెళ్ల ప్రసాద్, నులకని వీరస్వామి నాయుడు, ముప్పిడి శ్రీనివాసరావు, ఇర్ల శ్రీనివాస్ రెడ్డి, గురజాల పార్థసారథి, తానిగడప రామకృష్ణ, వామిశెట్టి హరి బాబు, కుక్కల ధర్మరాజు, బీవీఆర్ చౌదరి, పెద్దలు పోల్నాటి ప్రభాకర్, మల్లిడి బాబి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, పార్టీ పెద్దలు పాల్గొన్నారు.

పార్టీ చింతలపూడి మండల అనుబంధ కమిటీల నియామకం

చింతలపూడి : గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చింతలపూడి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు శనివారం తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. చింతలపూడి మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా అడపా సురేష్, మహిళా విభాగానికి చింతం వెంకటేశ్వరి, రైతు విభాగానికి చింతల శ్రీనివాస్ రెడ్డి, బీసీ సెల్ మండల విభాగానికి పెనుబోయిన రమేష్, ఎస్సీ సెల్‌కు తులి మిల్లి శ్రీను, ఎస్టీ సెల్‌కు కాసిన లక్ష్మీనారాయణ, మైనార్టీ సెల్‌కు ఎస్‌కే నాగూర్ మీరావలి, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు గొంది రాజు, స్టూడెంట్ విభాగానికి తుమ్మూరు శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగానికి కలకొండ రాంబాబు, వాలంటీర్స్ విభాగానికి నాగ వెంకటేశ్వరరావు, వీవర్స్ విభాగానికి తెగడ వెంకన్న, వాణిజ్య విభాగానికి చుండూరు నాగేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ విభాగానికి నారపాం సందీప్, గ్రీవెన్స్ సెల్‌కు బుల్లా దాసు, అంగన్‌వాడీ విభాగానికి కనమతరెడ్డి సుభద్రా లక్ష్మీ కుమారి, కల్చరల్ విభాగానికి అధ్యక్షురాలిగా ఇస్లావత్ కుమారి, సోషల్ మీడియా వింగ్‌కు పాకనాటి నరసింహారావు, పబ్లిసిటీ వింగ్‌కు ఎడ్ల మోహన్‌రావు, దివ్యాంగుల విభాగానికి ప్రొద్దుటూరు అనూష, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షుడిగా మొలుగుపాటి సుధాకర్‌లు నియమితులయ్యారు.

పార్టీ బలోపేతానికి కృషి



కొమ్మిన నరేష్

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కామవరపుకోట మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన కొమ్మిన నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చింతలపూడి నియోజకవర్గం ఇన్‌చార్జి కంభం విజయరాజుకి, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరావుకి, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్‌కి, మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణకు, స్థానిక నాయకులకు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బాబ్జి, రమేష్



బాబ్జి (శ్రీనివాసరావు)



రెడ్డిన రమేష్

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఏలూరు జిల్లా యువజన విభాగం కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లింగపాలెం మండలం తోచలక రాయుడుపాలెం గ్రామానికి చెందిన రెడ్డి బాబ్జి అలియాస్ శ్రీనివాసరావు, రంగాపురం గ్రామానికి చెందిన రెడ్డిన రమేష్‌లు నియమితులయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సేంద్రియ ఎరువుల వల్ల భూమికి, రైతులకు ప్రయోజనం ఉంటుందని ప్రకృతి డివిజనల్ మోడల్ టెక్నీషియన్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రకృతి శాఖ మండల ఇన్‌చార్జి సంజీవరావు ఆధ్వర్యంలో కరుటూరి రామకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో పలువురు రైతులకు ప్రకృతి ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. 15 ఎకరాలు సరిపడా పంచగవ్య, వేప గింజల కషాయం, జీవామృతం, పాల ఇంగువ కలిపి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో డ్రోన్ కెమెరాతో స్ప్రే నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రవి, పాపారావు, సుజాత రైతులు పాల్గొన్నారు.

యడవెల్లి గ్రామంలో..

లింగపాలెం: మండలంలోని యడవల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్ రైతులకు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నానో యూరియాను వినియోగించాలని సూచించారు. రైతులకు పాస్ఫోబాక్టీరియాం, సుడోమోనస్ జీవన ఎరువులను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ గణేష్, వీఏఏ టి.అజయ్, చెలికాని కృష్ణరావు, దెసినశెట్టి రమణయ్య, ఉలస నాగ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

భోజన పథకం అమలుపై ఆరా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

కామవరపుకోట: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఒంటిపల్లి విజయకృష్ణ అన్నారు. శనివారం కామవరపుకోట మండలం అడమిల్లి అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీయూపీ పాఠశాల, జెడ్పీ పాఠశాలల్లో తనిఖీలు చేశారు. విద్యార్థుల హాజరు, వంట, సరుకుల నిల్వ వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. పరిశుభ్రత పట్ల దృష్టి సారించాలన్నారు. జెడ్పీ హైస్కూల్లో నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రాన్ని వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. భోజనం తయారీ విషయంలో విద్యార్థులు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని, సిబ్బంది పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పోలవరం రూరల్: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ ఎల్ సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలవరం, చేగొండిపల్లి, కుంకాల హైస్కూల్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వి.సూర్యనారాయణ మూర్తి, సీఆర్‌పీలు దిలీప్‌కుమార్, దామోదర్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన వెంకన్న భూమి స్వాధీనం



భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో అన్యాక్రాంతమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎకరం భూమిని కోర్టు ఆదేశాల మేరకు శనివారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దేవస్థానానికి చెందిన భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీను ఏర్పాటు చేశారు. వివరాల ప్రకారం 1957వ సంవత్సరంలో దాత వగ్వాల వెంకటరామారావు జిల్లా సబార్డినేట్ జడ్జి ద్వారా వారి ఆస్తులను వారసులకు పంచుతూ ఆయన కులదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి 76/2ఏ సర్వే నెంబర్‌లో ఎకరం భూమిని కుమార్లు, కుమార్తెలు, కుటుంబ సమ్మతితో ఇచ్చారు. అయితే ఆ భూమిని అదే గ్రామానికి చెందిన వగ్వాల కృష్ణమూర్తి అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆలయ కమిటీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆ భూమి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి చెందాలని గతంలో కోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు కోర్టులో కేసు గెలిచి, కోర్టు ఆర్డర్ పొందారు. దీంతో ఆ భూమిని దేవదాయ శాఖ చట్టం 26/2023 ద్వారా దేవస్థానం, పోలీస్, రెవెన్యూ అధికారులు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి కూచిపూడి శ్రీనివాస్, తనిఖీ అధికారి బాబూనాయుడు, ఈఓ కె.వంశీ తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



పారిజాతగిరిలో జడ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గిరిప్రదక్షణ చేసిన భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు మేకా సుబ్రహ్మణ్యం, రమాదేవి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారని చెప్పారు. స్వామివారిని జిల్లా ఫ్యామిలీ కోర్టు కం 7వ అదనపు జిల్లా సెషన్ జడ్జి వై.శ్రీనివాసరావు దర్శించుకున్నారని తెలిపారు. జడ్జిని స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో సత్కరించారమన్నారు. స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో శనివారం సందర్భంగా స్వామి వారికి అభిషేక సేవ నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,00,074లు సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. స్వామివారిని జడ్జి వై.శ్రీనివాసరావు దర్శించుకున్నారని, ఆయనకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశామని, తొలుత ఆలయ మర్యాదలతో స్వాగతం పలికామని చెప్పారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, సిబ్బంది, లక్కవరం ఏఎస్సై పాల్గొన్నారు. వినాయక చవితి ప్రతిమను శనివారం నిమజ్జనం చేశామని ఈఓ తెలిపారు.

జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాసరావుకు సత్కారం



కోర్టు ప్రాంగణంలో జడ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం: ఫ్యామిలీ కోర్టు జడ్జి కం 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.శ్రీనివాసరావు జంగారెడ్డిగూడెం కోర్టును శనివారం సందర్శించారు. ఆయన్ని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి ఆహ్వానించారు. అనంతరం బార్ హాల్లో జూనియర్ - సీనియర్ న్యాయవాదులకు ఉపయోగపడే విధంగా ఒక ప్రత్యేక క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావును సీనియర్ న్యాయవాదులు పిల్లి పెద్దిరాజు, చిరంజీవి రాంబాబు, మన్నెల్లి గంగరాజు, గుమ్మల్ల మణికుమార్, డీఆర్‌వీ కృష్ణ, కురుమేళ్ల హరి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, వైస్ ప్రెసిడెంట్ సుగుణ కుమారి, లైబ్రరీ సెక్రటరీ లలిత కుమారి, లేడీ రిప్రజెంటేటివ్ రాజీవ్ కుమారి, మహిళా న్యాయవాదులు తోట పద్మిని, వామిశెట్టి హిమబిందు, గెద్ద గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం సీతంపేట బీసీ బాలికల సంక్షేమ పాఠశాలలో విద్యార్థినులకు కొయ్యలగూడెం నేత్ర వైద్యుడు సీహెచ్ చక్రవర్తి కంటి పరీక్షలు చేశారు. మొత్తం 264 మందిలో 17 మందికి దృష్టి లోపం ఉందని, వీరికి కళ్ల జోళ్ల నిమిత్తం ఏలూరు అంధత్వ సంస్థకు సమాచారం పంపించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సరైన పోషకాహారం, ఆకు కూరలు, క్యారట్, బీట్‌రూట్, కరివేపాకు, మునగాకు బాగా తీసుకోవటం వల్ల దృష్టి లోపాలురావని, కంటి చూపు ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కంటి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బీసీ బాలికల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి, సూపర్‌వైజర్ బాషా, హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మి దుర్గ, స్టాఫ్ నర్స్ బి.రజిని, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్‌ఎం పి.ఉమ, ఆశ కోమలి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కామవరపుకోట: సీపీఎస్ విధానం రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ జిల్లా కార్యదర్శి కోస్నే శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు ఎం శివప్రసాద్, గుమ్మడి వెంకటరావు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన వాణిజ్య శాస్త్ర శాఖ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మట్టా మధు, వాణిజ్య శాస్త్ర శాఖ విభాగ అధిపతి కె.ఉత్తమ సాగర్ మాట్లాడారు. చిన్న తరహా పరిశ్రమల ద్వారా నైపుణ్యం ఉన్నవారికి పని లభించడమే కాకుండా లాభాల బాటలో నడిస్తే భవిష్యత్తులో పెద్ద పరిశ్రమ స్థాయికి ఎదగటానికి అవకాశం ఉంటుందని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాసానంద సరస్వతి క్షమాపణ చెప్పాలి

చింతలపూడి : తిరుపతిలో హాథీరామ్ బావాజీ మఠాన్ని కూల్చాల్సిందేనని 16 కోట్ల బంజారాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన శ్రీనివాసా నంద సరస్వతి తక్షణం క్షమాపణ చెప్పాలని ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 27న శ్రీనివాసనంద సరస్వతి హాథీరామ్ బావాజీ మఠం నిర్మాణాలను తొలగించాలని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. శనివారం చింతలపూడిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్యా నాగేశ్వరావు నాయక్, జి.కృష్ణ నాయక్‌లు మాట్లాడారు. 126 సంవత్సరాల చరిత్ర గల హాథీరామ్ బావాజీ మఠంపై కుట్రపూరిత చర్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మఠం ఆస్తులను కాపాడేందుకు స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధారావతు కిమ్యా నాయక్ ,ధారావతు రాజబాబు నాయక్ పాల్గొన్నారు.

'తెలుగు భాష ఔన్నత్యం'పై రేడియో ప్రసంగం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి త్రి శతజయంతి ప్రభుత్వ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు జి.వెంకట లాల్ ప్రపంచ వేదికగా నిర్వహించిన రేడియో ప్రసంగంలో తెలుగు భాష ఔన్నత్యం అనే అంశంపై ప్రసంగించారు. 96 దేశాల శ్రోతలు తన ప్రసంగాన్ని విన్నారు. ఈ కార్యక్రమానికి మారిషస్ తెలుగు తల్లి ప్రేమ సంస్థ నిర్వాహకులు పద్మ విభూషణ్ సంజీవ నరసింహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మధురమైనది, తీయనైనది, అమ్మ పాల వంటిది, ప్రాచీనమైనది విశ్వభాషల్లో గొప్పదైన తెలుగు భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వెంకట లాల్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు ఈ ప్రసంగాన్ని కళాశాలలోని విద్యార్థులందరూ వినేటట్టు ఏర్పాటు చేశారు. వెంకట లాల్ ను వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఉత్సాహంగా బాలల గణేషుడి ఊరేగింపు



ద్వారకాతిరుమల : గణేషుడి రథాన్ని లాగుతున్న బాలలు



ద్వారకాతిరుమల: పసరుకోనేరు వద్ద అన్నసమారాధన



కొయ్యలగూడెం : కన్నాపురంలో ఊరేగింపు



జంగారెడ్డిగూడెం : దుర్గమ్మ ఆలయంలో గణపతి పూజ

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెం రామాలయం వద్ద 14 మంది బాలలు ఏర్పాటు చేసిన గణేషుడి విగ్రహాన్ని వారు శనివారం గ్రామంలో ఊరేగించారు. గణనాథుడి విగ్రహాన్ని రథంలో ఉంచి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బాలలే స్వయంగా రథాన్ని లాగుతూ డప్పు వాయిద్యాల నడుమ అట్టహాసంగా ఊరేగించారు. రాత్రి వినాయక విగ్రహాన్ని స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద బాలలు అన్నసమారాధన నిర్వహించారు.

భారీ అన్నసమారాధన

ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జనాలు, అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ద్వారకాతిరుమలలోని పసరుకోనేరు వద్ద ద్వారకా శ్రీ కుంకుళ్లమ్మ తల్లి ట్రక్ ఆటో యూనియన్ వారు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన భక్తులు పాల్గొని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా గణనాథుల ఊరేగింపు

కొయ్యలగూడెం: గణనాథుల ఊరేగింపులు శనివారం మండల వ్యాప్తంగా కనుల పండువగా నిర్వహించారు. కన్నాపురంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఊరేగింపు మహిళలు కోలాటం భజన, పురుషులు ఏక వస్త్రధారణ తలపాగల నడుమ నిర్వహించారు. రేపల్లెవాడ రామాలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కొయ్యలగూడెం వాటర్ ట్యాంకు రామాలయం వద్ద ఆదివారం అన్నసమారాధన, సాయంత్రం నుంచి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీగణపతి హోమం

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వినాయక ప్రతిమకు నిత్య పూజలు చేశారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహన్‌రావు, అభివృద్ధి కమిటీ సభ్యులు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.